# చలికాలం

– యం.డి. యస్దాన్

వసుధాదేవి చలికాలంలో తన కోడలు రాధను ఏమీ అనదు! రోజూ ఏదో వంకతో రాధను బాధపెట్టడం ఆమెకు అలవాటు. కోడలు కడిగిన గిన్నెలను మరకలు పోలేదంటూ తిట్టి ''అంట్లు కడగడం కూడా నీకు నేర్పలేదా?'' అంటు హింసిస్తుంటుంది!

రాధ ఏడుస్తుంటే ఆ గిన్నెలను తను మళ్లీ కడుగుతూ ఆనందిస్తుంటుంది. ఇలా ప్రతిపనికీ ఏదో వంకపెట్టి ఆమెను ఏడ్పిస్తూ ఆపనే తను మళ్లీ చేస్తుంటుంది. కాని, చలి అంటే పులి కన్న ఎక్కువ భయం ఆమెకు!

అందుకే చలికాలంలో సూర్యుడు నడినెత్తిమీదకు వచ్చేవరకు నిద్రమత్తులోనే ఉంటుంది. ఇక సంధ్యవేళ చెప్పనవసరంలేదు. ఆరుగంటలకే రాత్రి భోజనం కానిచ్చి దుప్పటి కప్పుకుంటుంది. ఆ విధంగా రాధకు చలికాలంలో కొద్దిగా బాధ తగ్గుతుంది.

వసుధాదేవి భర్త రాఘవరావు మండలాఫీసులో హెడ్ గుమస్తాగా ఉండేవాడు. బ్రతికి ఉన్నంత వరకు అతను సంపాదించిన ఆస్తి, వాళ్ళు ఉంటున్న రెండు పోర్షన్‌ల ఇల్లు మాత్రమే.

అతను పోయాక ఎలాగో అతని కొడుకు వంశీకి ఆ ఆఫీసులోనే ఉద్యోగం వచ్చింది. ఆవెంటనే రాధతో పెళ్లి అయింది. అతని పెళ్లి అయిన కొత్తలోనే చెల్లెలు వరలక్ష్మి పెళ్లికూడ చేశాడు. మండలాఫీసులో ఉద్యోగం కావడంవల్ల పై సంపాదన బాగానే వస్తుంది. దాంతో ఇంట్లో కావాల్సిన వస్తువులన్నీ గుర్తుపెట్టుకొని మరీ తెస్తాడతను. అన్ని ఉన్నా వసుధాదేవికి మాత్రం ఏదో వెలితి?!

దాంతో ఎప్పుడూ అసంతృప్తిగానే ఉంటుందామెకు. సినిమాల మీద ఆసక్తి లేకపోవడంవల్ల టీవి చూడదామె. ఇరుగు పొరుగుతో కబుర్లు కోడల్ని సాధించడం... ఇదే ఆమె కాలక్షేపం. ఆమె ప్రవర్తనను రాధ మొదట్లో 'చాదస్తంలే' అని సరిపెట్టుకుంది.

భర్తతో చెబితే తన గురించి ఏమనుకుంటాడో, అమ్మ మీద చాడీలు చెబుతున్నానని అపార్థం చేసుకుంటారేమోనని భయం. కన్నవాళ్ళతో చెప్పుకొని వాళ్ళను బాధపెట్టడం ఇష్టంలేదు. ఇలా మింగలేక కక్కలేక సతమతమయ్యే ఆమెకు చలికాలం మాత్రమే కొద్దో గొప్పో ఓదార్పునిస్తుంది.

• • •

ఆరోజు వంశీ ఆఫీసుకు వెళ్లిపోయాక పక్కింటి పంకజంతో కబుర్లకోసం వెళుతున్న వసుధాదేవి, ఎదురుగా వస్తున్న వనజాక్షిని చూసి ఆగిపోయింది.


వనజాక్షికి కూడ ఇంచుమించు వసుధాదేవి వయసే ఉంటుంది. ఆ మండలానికి దగ్గరలోని సిరిపల్లె ఆమెది. అక్కడ పండిన కూరగాయలను ఇక్కడకు తెచ్చి అమ్ముకుంటుందామె.


వనజాక్షిని చూస్తునే ఆమెతోపాటు మళ్లీ లోనికొస్తు ''ఏంటే వారం నుంచి రావడంలేదు. ఇంక నువ్వు కూరగాయలు అమ్మడం మానేశావేమో అనుకున్నానే'' అంది.

వనజాక్షి కూరగాయల బుట్ట క్రిందకు దింపుతూ, ''లేదమ్మగారు నాకోడలు పురుడుపోసుకుంది. అందుకే రాలేదు'' అంది.

వసుధాదేవి బుట్టలో వంకాయలను ఏరుతు ''సంవత్సరం క్రితం కొడుకుకు పెళ్లిచేశావు. అప్పుడే మనవడ్ని ఎత్తుకున్నావన్నమాట. ఆ అదృష్టం అందరికి ఉంటుందా? నాకోడలు వుంది దేనికి? పెళ్లి అయి మూడు సంవత్సరాలైన.. నా ముఖానికి మనవడ్ని ఎత్తుకునే అదృష్టమే లేదు. ఎన్ని దేవుళ్ళకు మొక్కుకున్న ఏం లాభం? దానిముఖంలో శని నాట్యం చేస్తుంది. తల్లి అయ్యే కళ ఉందా అసలు ఆ ముఖంలో. చూస్తాను మరో నెల రెండు నెలలు. దీని వ్యవహారం ఇలాగే ఉంటే మావాడిచేత దీనికి విడాకులు ఇప్పించి వాడికి మరోపెళ్లి చేసిపారేస్తాను. అప్పుడుకాని దీని తిక్క కుదరదు.''

ఈ మాటలంతా వంటింట్లో నుంచి రాధ వింటుందని ఆమెకు తెలుసు. వినాలనే చెప్పింది కూడ. రాధ మాత్రం మూగగా రోదిస్తుంది. ఒకరికి కలిగే బాధ మరొకరికి ఆనందాన్నిస్తుంది. అదే విచిత్రం. రాధ పడే





బాధలో ఆనందాన్ని వెతుకుంటుంది వసుధాదేవి!

• • •

ఆరోజు రాత్రి ఎప్పటిలాగే వంశీ శృంగారతాపంతో రాధ పక్కకు చేరాడు. ఆమె మంచాని కొసకు అనుకొని అటుతిరిగి పడుకొని ఉంది. అతను ఆమె నడుముపై చేయివేసి తనపక్కకు తిప్పుకోబోయాడు. కాని, ఆమె తిరగలేదు. వెనుక నుంచే ఆమెను కౌగిలించుకొని మెడపై ముద్దుపెట్టి ఆమె తలను తనవైపుకు తిప్పుకొని ఆమె కళ్ళలోకి చూశాడు. ఆమె కళ్ళలో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి.

అతను ఆశ్చర్యంగా "రాధా ఏంటిది? వంట్లో బాగాలేదా?" అడిగాడు.

ఆమె మౌనంగా ఉండిపోయింది.

అతనికి భార్యంటే ఎనలేని ప్రేమ. తన చేత్తో సున్నితంగా ఆమె కళ్ళు తుడుస్తూ "ఎందుకు ఏడుస్తున్నావంటే చెప్పవేం?" అడిగాడు.

వెంటనే ఆమె పూర్తిగా అతనివైపు తిరిగి అతనిని అల్లుకుపోతూ బోరుమంది. అతను ఆమె వీపుపై చేయివేసి సముదాయిస్తూ-

"భార్యాభర్తలంటే సుఖాలే కాదు, కష్టాలు పంచుకోవాలి. చెప్పు ఎందుకు ఏడుస్తున్నావు?" అన్నాడు.

ఆమె రెండు క్షణాలు అలాగే మౌనంగా ఉండిపోయి ఆ తరువాత అతనికి ఇంకొంచెం గాఢంగా అల్లుకుంటు "ఏవండి మిమ్మల్ని విడిచి, మీతో దూరమై నేనుండలేనండి" అంది.

అతను ఆమె నుదిటిపై ప్రేమగా చుంబించి "పిచ్చిదాన ఏంటాపిచ్చి మాటలు. నిన్ను వదిలి నేనెక్కడికి పోతున్నాను?" అన్నాడు.

ఆమె దీర్ఘంగా నిట్టూర్చి అతనికి దూరంగా జరుగుతూ. "మన పెళ్లి అయి మూడేళ్ళు అయిన మనకింక పిల్లలు పుట్టలేదని, మీ అమ్మ నాకు మీచేత విడాకులిప్పించి మీకు వేరే పెళ్లి చేస్తానంటుంది."

ఆమె అంటున్నది ఏమిటో ఒక్కక్షణం అర్థంకాలేదతనికి. అర్థమైన వెంటనే పెద్దగా నవ్వేశాడు. అతనివైపు భయంగా చూసిందామె. అతను ఆమెను నెమ్మదిగా దగ్గరకు లాక్కొని ఆమె కురులను సవరిస్తూ "అదా నీ భయం. ఇన్నాళ్ళకి మా అమ్మ అన్న మాటలను ధైర్యంగా నాతో చెబుతున్నావు" అంటు లేచి సిగరెట్టు వెలిగించాడు.

ఆమె భయంగా అతన్నే చూస్తుంది. అతని గుండెల నిండ పీల్చిన పొగను గాల్లో వదులుతు, "మా అమ్మ ప్రవర్తన నేను గమనిస్తునే ఉన్నాను రాధా, ఆమె అకారణంగా నిన్ను నిందించడం, సూటిపోటి మాటలతో నిన్ను హింసించడం అంతా వింటునే ఉన్నాను. కాని, నువ్వు మాత్రం భూదేవిలా అన్నీ భరిస్తునే ఉన్నావు. ఎప్పుడైనా మా అమ్మ గురించి నాతో ఫిర్యాదు చేస్తావేమో చూద్దామంటే నువ్వు ఎప్పుడు ఏమీ చెప్పలేదు. అత్తమీదున్న నీ గౌరవం, నీ ఓర్పు చూసి నాకు ముచ్చటేసింది. అందుకే నీపై నాకున్న ప్రేమ రెట్టింపు అయింది. అయితే కొన్ని విషయాలు చెప్పడం ఎంత చెడ్డదో మరికొన్ని విషయాలు చెప్పకపోవడం కూడ అంతే చెడ్డది."

ఆమె ఆశ్చర్యంగా వింటోంది. అతను చెప్పుకుపోతున్నాడు. "చిన్నప్పటి నుంచీ మా అమ్మ నన్ను ఎంతో ప్రేమతో పెంచింది. పెళ్లికాక ముందు నేను ప్రతి విషయానికి ఆమెపై ఆధారపడేవాడ్ని. పెళ్లి అయిన తరువాత నేను ప్రతి విషయంలోను నీమీద ఆధారపడుతున్నాను. పురుషుడు జీవితాంతం స్త్రీమీద ఆధారపడతాడు. పుట్టిన దగ్గర నుంచి పెళ్లి అయ్యేవరకు అమ్మ ఆధారమైతే పెళ్లి అయ్యాక ఆ ఆధారం భార్య అవుతుంది. కాని తల్లి దీన్నే మరోవిధంగా భావిస్తుంది. పెద్ద వయసులో ఆమెనింక కష్టపెట్టడం దేనికి అని నేను భావిస్తే ఆమె మాత్రం దాన్ని తప్పుగా అర్థం చేసుకుంది. భార్య వచ్చాక తనని కొడుకు పట్టించుకోవడం లేదనుకుంటోంది."

చెప్పడం ఒక్కక్షణం ఆపి సిగరెట్టు చివరి దమ్ములాగిపారేసి అతను వచ్చి ఆమె పక్కన కూర్చున్నాడు. "ఒకవేళ తప్పు నిజంగా కొడుకు చేసిన, అది చేయించింది కోడలే అనుకుంటుందామె. అందుకే కోడలిపై కత్తికట్టి ఇలా కసి తీర్చుకుంటుంది. అత్తమీద గౌరవం ఉండాల్సిందే. కాని, ఆ గౌరవం బాధగా మారితే మాత్రం భర్తతో చెప్పుకోవాలి. అందులో తప్పులేదు."

ఆమె అతని గుండెలమీద వాలిపోయింది. అతను అలాగే ఆమెను తన హృదయానికి హత్తుకుంటూ "నీ బాధను ఎలా తప్పించాలో నాకు తెలుసు. నాపై ప్రేమను కురిపించే నీ కళ్ళలో ఆనందమే తప్ప కన్నీళ్ళను నేను చూడలేను" అన్నాడు. ఆమె అలాగే అతనిని అల్లుకుపోయింది. అతని గుండె చప్పుడు వింటుంటే ప్రశాంతంగా ఉందామెకు.

• • •

## జననీ జన్మభూమిశ్చ

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ' అని బొబ్బిలిపులి సినిమాలో ఎన్టీఆర్ పాడతాడు. ఇంతకీ ఈ మాటలు ఎక్కడివో తెలుసా? వాల్మీకి రామాయణంలోవి. భరతుడు ఎలాగూ అయోధ్యను పాలిస్తున్నాడు గదా, లంకను పాలించమని లక్ష్మణుడు కోరగా, శ్రీరాముడు అన్న మాటలివి.

## షోకేసు భామలు

బట్టల షాపుల్లో ప్రచారం కోసం షోకేసుల్లో వివిధ రకాలైన దుస్తులు ధరించిన బొమ్మలను 'మానెకిన్స్' అంటారు. ఈమధ్య 'హ్యూమన్-మానెకిన్స్' ప్రచారం మొదలైంది. కంపెనీ దుస్తుల ప్రచారం కోసం వివిధ రకాల డిజైన్ల దుస్తులు ధరించి షోకేసుల్లో బొమ్మల్లా నటిస్తున్నారు భామలు. ఈ రకమైన మోడలింగ్‌కు ఇజ్రాయిల్‌లో ఎక్కువ గిరాకీ వుంది.

## తొలి డిటెక్టివ్ రచయిత

తొలి తెలుగు డిటెక్టివ్ రచయిత ఎవరో తెలుసా? వాడే వీడు *(1912)*, నేనే *(1918)*, కాలూరాయి *(1925)* వంటి అపరాధ పరిశోధన నవలలు వ్రాసింది దేవరాజు వేంకట కృష్ణారావు. మహాకవి శ్రీశ్రీ 'వాడే వీడు' ఇన్‌స్పిరేషన్‌తోనే తానూ ఒక డిటెక్టివ్ నవల వ్రాశారు.

-చిణ (రాజమండ్రి)

బట్టలు సరిగ్గా వుతకలేదని కోడల్ని ఎప్పటిలాగే తిడుతూ వాటిని మళ్లీ నానబెట్టబోతున్న వసుధాదేవి, ఒంటరిగా ఆటోదిగుతున్న కూతురు వరలక్ష్మిని చూసి ఆశ్చర్యపోయింది. ''ఏంటే హఠాత్తుగా ఇలా చెప్పాపెట్టకుండా వచ్చేశావు?'' అంది.

వరలక్ష్మి మౌనంగా సూటుకేసు తీసుకొని లోపలికొచ్చి సోఫాలో కూర్చుంది. కూతురు వదనం కళాహీనంగా ఉండడం గమనించి ఏదో జరిగి ఉంటుందని ఊహించింది వసుధాదేవి. వరలక్ష్మి పక్కన కూర్చుని ఆమె తల మీద ప్రేమగా చేయివేసి ''ఏమైందమ్మా?'' అంది.

వరలక్ష్మి వెంటనే తల్లిని చుట్టుకొని గొల్లున ఏడ్చేసింది. వసుధాదేవి, రాధ ఇద్దరూ సముదాయించాక అసలు విషయం చెప్పింది. ''అమ్మా మా పెళ్ళయి రెండేళ్ళయినా నాకింకా పిల్లలు పుట్టలేదని మా అత్తయ్య తిడుతోంది. ఆయనకు మరో పెళ్లి చేస్తానంటూ బెదిరిస్తోంది. ఏదోకారణం పెట్టి నన్ను హింసిస్తుంది. ఈ బాధలు భరించలేకపోతున్నానమ్మా. అందుకే వచ్చేశాను.''

వసుధాదేవికి ఏం చెప్పాలో అర్థంకాక మౌనంగా ఉండిపోయింది. రాత్రి వంశీ వచ్చాక విషయమంతా తెలుసుకొని ''రేపు బావగారితో నేను వెళ్లి మాట్లాడుతానులే'' అని చెప్పేంత వరకు ఆమె భయపడుతునే ఉంది. అప్పుడు ఆమె మనసు కాస్త కుదుటపడింది.

మర్నాడు వంశీ వెళ్లి బావ శేఖరాన్ని తన ఇంటికి పిలుచుకొని వచ్చాడు. అల్లుడికి అన్ని మర్యాదలు చేసింది వసుధాదేవి. ''బావ మేము వేరుకాపురం వెళ్లిపోతే బాగుంటుందని నా అభిప్రాయం. మరి మీ చెల్లెలు ఏమంటుందో కనుక్కో'' అన్నాడు శేఖర్.

''అదేమిటి బావా వేరుకాపురం ఎందుకు వెళ్ళాలి? అయినా ఇప్పుడంత అవసరం ఏమొచ్చిందని?'' అడిగాడు వంశీ. ''నీకు తెలియదులే బావా. అక్కడుంటే ఈ అత్తాకోడళ్ళ పోరు నేను భరించలేకున్నాను. నాకు మనశ్శాంతి లేకుండాపోతుంది.''

''వరలక్ష్మిది ఏదన్న తప్పు ఉంటే చెప్పుబావ. దాన్ని నేను మందలిస్తాను. అంతేకాని, అనవసరంగా వేరు కాపురం పెట్టడం దేనికి?'' అన్నాడు వంశీ.

''నాకు సమస్య వరలక్ష్మితో కాదు బావా, అమ్మతో! అనుక్షణం ఏదో వంకతో వరలక్ష్మిని ఆమె హింసిస్తుంటే నేను చూడలేకపోతున్నాను. ఆమెదంతా చాదస్తం. అంతా పాతకాలం పట్టింపులు. ఇప్పటి వాళ్ళు ఆమెలాగే ఉండాలంటే ఎవరుంటారు? సెంటిమెంట్లతో చంపేస్తుంది. పిల్లలు పుట్టలేదని మాకులేని బాధ ఆమెకెందుకు? మాకు పెళ్లి అయి ఏ పది పన్నెండేళ్ళు అయిందా? అయినా అదోసాకు. మేమిద్దరం సంతోషంగా ఉండడం ఆమె చూడలేదు. అందుకే- ఇలా అర్థంపర్థం లేకుండా ప్రవర్తిస్తుంది. తల్లి అనే విలువ నేను, అత్తగారు అనే గౌరవం వరలక్ష్మి ఇస్తున్నప్పుడు ఆమె దాన్ని నిలుపుకోవాలి. అలా కాకుండా మామధ్య మనస్పర్థలు ఏర్పర్చి మమ్మల్ని విడదీయాలనుకుంటే అది ఆమె భ్రమ. నాకు తల్లి అంటే ప్రేమ ఉంది. భార్య అన్నా ప్రేముంది. ఆ ప్రేమ భార్యమీద ఉండకూడదంటే ఎలా? అదే ఆమె భర్త ఆమె మీద ప్రేమ చూపకుంటే ఆమెకెలా ఉంటుంది? కోడలు కూడా అంతే కదా? అది ఆలోచించకుండా నా భార్యను హింసిస్తుంటే చూస్తు వూరుకోలేను బావా. అందుకే వేరుకాపురం వెళ్ళిపోతాను. అప్పటికికాని మా అమ్మకు మా విలువ తెలిసిరాదు'' ఆవేశంగా అన్నాడు శేఖర్.

''మనిషికి వయసు పెరుగుతుంటే మనసు మాత్రం పసివాడివలే మారుతుంది. తనది తనకు మాత్రమే సొంతం. వేరెవరిది దానిమీద హక్కులేదు. వేరెవరి మీద ఆ వ్యక్తి తనకన్న ప్రేమ చూపకూడదు అనుకుంటారు. అలాంటి వాళ్ళకు మంచితనంతో సర్దిచెప్పి వాళ్ళ తప్పు తెలుసుకునేలా చెయ్యాలే కాని, మనం ఆవేశపడి ఇలాంటి నిర్ణయాలు తీసుకోకూడదు. వరలక్ష్మిని తీసుకుని ఇంటికెళ్ళు'' అంటూ వంశీ నచ్చచెప్పడంతో వరలక్ష్మి, శేఖర్ వెళ్లిపోయారు.

కాని వసుధాదేవికి మాత్రం భయం పట్టుకుంది. తను పెడుతున్న బాధలు భరించలేక తన కోడలు కూడా ఇలా వెళ్లిపోతే? తన కొడుకు అల్లుడిలాగే వేరు కాపురం నిర్ణయం తీసుకుంటే తన గతేం కాను! ఆ స్థితే ఊహించలేకపోయిందామె.

అల్లుడు చెప్పిన మాటలన్నీ మరోసారి మననం చేసుకుంది. నిజమే తను తల్లికంటే ముందు ఒకరి భార్య. తన భర్త తనపై ఎంతో ప్రేమ కురిపించాలని కోరుకుంది. అలాగే తన కోడలు కోరుకోవడంలో తప్పేముంది? ఈకాలంలో కొందరు కోడళ్ళు అత్తను పని మనిషి కంటే హీనంగా చూస్తున్నారు. కానీ, తన కోడలు తనను దేవతలా చూస్తుంది. అలాంటి ఆమెను సతాయించడం ఎంతవరకు సబబు?''

ఇలా ఆలోచించాక ఆమెకు జ్ఞానోదయం అయింది. అంతే ఇక అప్పటి నుంచి ఆమె తన పద్ధతి మార్చుకొని కోడలితో ప్రేమగా ఉండటం ప్రారంభించింది. ఇక ఏకాలమైనా చలికాలంగానే మారడంతో రాధ సంతోషంతో పొంగిపోయింది. కాని, ఇదంతా శ్రీకృష్ణుడిలా తన భర్త చేయించిన జగన్నాటకమని ఆమెకు తెలియదు!

వంశీ చాకచక్యంగా ఆలోచించి చెల్లెలు, బావగారి సహాయంతో ఈ నాటకమాడి తన తల్లి కళ్ళు తెరిపించి రాధ జీవితంలో వెన్నెల వెలుగులు విరజిమ్మాడు!

★

